

# ఓ జంట కలిసిన తరుణం



జొన్నలగడ్డ లలితాదేవి



రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

అక్కడక్కడ మబ్బులు కమ్ముకుంటూ వస్తున్నాయి. అసలే చీకటి రోజులు. నల్లని మబ్బులతో మరింత నల్లదనాన్ని నింపుకుంది నిశీధివి.

విజయవాడలో రైవీస్ కాలువకు కాస్త దగ్గరగా ఓ పెంకుటిల్లు.ఆ పెంకుటింటి ముందు ఓ జీప్ వచ్చి ఆగింది. అందులోనుంచి అరడజనుమంది పోలీసులు – యస్.పి. మెల్లగా క్రిందికి దిగారు. మరుక్షణంలో ఆ పెంకుటిల్లు రైడ్ చేయబడింది. అందులోనుంచి ఓ నలుగురు ఆడవాళ్ళని, నలుగురు మగవాళ్ళని వాన్ ఎక్కించారు పోలీసులు. లోపల ఇంకా ఎవరైనా ఉన్నారేమో చూద్దాం అన్నట్లు యస్.పి. సుధాకర్ లోపలికి వచ్చాడు. అన్నిగదుల్లోనూ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అలా వెతుక్కుంటూ అతడు పెరటివైపు బయలుదేరాడు. బాత్‌రూం తలుపు వేసుంది లోపల. అతనికి అనుమానం వచ్చి గట్టిగా తోశాడు బూటు కాలితో. తలుపు దభాలుమని తెరుచుకుంది.

అక్కడ బల్లిలా గోడకి అంటుకు

పోయి భీతహరిణేక్షలా చూస్తోంది ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి.

"ఎవరు నువ్వు? నువ్వూ ఈ జనాభా లోని దానివేనా?" అని అడిగాడు తీవ్రంగా.

అతని కంచు కంఠానికి గడగడా వణికింది ఆ అమ్మాయి.

"నేనూ అందులోని అమ్మాయినే కాని దయచేసి నన్ను జైలుపాలు చేయకండి" అంటూ అతని కాళ్ళమీద పడి భోరున ఏడ్చింది.

ఆమె ఏడుపుకు కరిగిపోయాడు చెట్టంత యస్.పి.

చక్కని ముఖం, విశాలమైన కళ్ళు, నల్లని నొక్కుల జుట్టు. ఏ అప్సరసో శాపవశాత్తు అక్కడ మగ్గిపోతున్నట్టు వుంది. బ్రహ్మచర్యం వెలిగిస్తున్న ఎస్.పి. సుధాకర్ హృదయాన్ని సూదంటు రాయిలా ఆకర్షించిందామె. అందుకే కఠినత్వం చూపించలేక పోయాడు

"నువ్విలాగే ఇక్కడ వుండు. నేను మళ్ళీ ఓ అరగంటలో వస్తాను." అంటూ పెద్దపెద్ద అడుగులు వేస్తూ జీప్‌లోఎక్కి కూర్చున్నాడు.

వ్యభిచార నేరానికిగాను – ఆ ఆడా మగా అంతా కస్టడీలో వున్నారు. అక్కడ కాస్త తెరిపిచ్చాక తిన్నగా అతనొక్కడే ఆ పెంకుటింటికి వచ్చాడు ఆమె అలాగే బెదురుతూ కూర్చుని వుంది.

"నీకేం భయంలేదు. నాతో రా మా యింటికి వెడదాం," అంటూ బయలుదేరాడు.

ఆ నిశీధినిలో ఆమె ప్రక్కన నడుస్తూ తన ఇంటికి తీసుకువచ్చాడు. లోపల తన గదిలో హాయిగా పడుకుని వున్నాడు తండ్రి.

"ఇదిగో! ఈ గదిలో హాయిగా విశ్రమించు. నాకు నైట్ డ్యూటీ. తెల్లవారేదాకా రాను" అంటూ ఆమెకేసి ఓసారి చూసి తిన్నగా తన పోలీసు స్టేషన్‌కి వెళ్ళిపోయాడు సుధాకర్.

పడుకున్నా ఆమెకి గుండెదడ తగ్గలేదు. ఆ పెంకుటిల్లు! ఛీ, మురికికూపం అది! ఈ భవంతే రెండు లక్షలుండవచ్చు. ఇంత ఖరీదైన మేడలో. ఈ ఖరీదైన పరుపుల మీద తనుపడుకోవడం అంటే కలా! నిజమా! నిరంతరం ఛీత్కారాలను భరించే తనకి ఆప్యాయతాదరణలా? అదీ కరుకుతనం మూసపోసుకున్న పోలీసు ఉద్యోగి నుంచి! ఇకనెంతసేపు ఉండనిస్తాడు తనని! తెల్లవారగానే "తల్లీ! దయచెయ్యి" అనకపోడు. అప్పుడు తన సమస్య భూమి గుండ్రంగా వుందన్నట్లు బయలుదేరిన చోటే ఆగిపోతుంది. కళ్ళవెంబడి నీళ్ళు గిర్రున తిరిగాయి.

లోకం మారిందన్నారు. సంఘం మారిందన్నారు... సంస్కరణలన్నారు. పతిత జనోద్ధరణ అన్నారు. అవన్నారు. ఇవన్నారు. చివరకివన్నీ స్టేజీలెక్కి ఉపన్యాసం దంచడానికి.కథల్లో అందంగా పేర్చుకోవడానికి పనికివచ్చాయే గాని యదార్థంగా ఆలోచిస్తే పతితు లన బడే వారిని ఉద్ధరించేవారు లక్షకి ఒకరున్నారా? అని.

అందుకే తనలాంటి ఆడపిల్లల జీవితాలు పాతాళానికింకా ఇంకా కూరుకుపోతుంటే కబుర్లరాయిళ్ళ సంఘసంస్కరణలు ఆకాశవీధిలో వుంటున్నాయి." కసిగా పెదవి కొరుక్కుంది.

ఇలా ఆలోచనల మధ్య అలా మగతగా నిద్రపోయింది. ఆమెకి మెళకువ వచ్చేసరికి ఘంటారావం మారుమ్రోగుతోంది. ఆ వెనుక "కౌసల్యా సుప్రజా రామ" అంటూ వెంకటేశ్వర సుప్రభాతం కర్ణపేయంగా వినిపిస్తుంటే ఆశ్చర్యచకితయై గది దాటి బయటకు వచ్చింది. ఆమె కాళ్ళు అలా ముందుకు సాగిమరో నాలుగు గదులు దాటాక తక్కున ఆగిపోయాయి. నిలువెత్తు వెంకటరమణుని విగ్రహం పూలదండలతో కళకళలాడిపోతోంది. ఆ దివ్యమంగళ విగ్రహానికిరువైపులా రెండు పెద్ద కంచుకుందులు. వాటిల్లో ప్రకాశవంతంగా వెలుగుతున్న జ్యోతులు. అగరువత్తుల సువాసన పూల పరిమళంతో చేయికలిపి ఆ గదినే ఆనంద నిలయంగా మార్చివేస్తున్నాయి. పెద్ద పీటమీద పట్టుబట్ట కట్టుకుని గంభీర కంఠంతో సుప్రభాతం చదువుకుంటున్నాడు సుధాకర్ తండ్రి లక్ష్మీపతి.

అక్కడే నిలబడి రెండు చేతులూ జోడించింది.

"మీనాకృతే కమఠకోల నృసింహ
వర్ణిన్
స్వామిన్ పరశ్వతపోధన రామ చంద్ర" లక్ష్మీపతి చదివేది శ్రద్ధగా వింటున్న ఆమె "దుష్టశిక్షణకోసం నువ్వు దశావతారాలు ఎత్తితే నాలాంటి నిర్భాగ్య జీవి ఎక్కడన్నా తారసపడిందా?" అనుకుంటూ కళ్ళు తుడుచుకుంది. వెనకనించి బూట్లు టకటక లాడాయి.

"ఇక్కడున్నావేం?" అంటూ పలకరించాడు సుధాకర్.

అప్పుడే తన ధ్యాన ముద్రలోంచి తిరిగి చూశాడు లక్ష్మీపతి. కొడుకుని, అతని పక్కన ఆడపిల్లనీ చూసి తెల్లబోయాడు. అయినా నిగ్రహించుకుంటూ తన పూజలో నిమగ్నమయ్యాడు.

"అన్నట్లు నీ పేరేమిటి?"

"అహల్య"

"అహల్యా" అంటూ తల పంకించి "ముఖం కడిగావా" అని అడిగాడు.

"లేదు"

"రా! ముఖం కడిగితే కాఫీ త్రాగవచ్చు" అంటూ "రంగన్నా"అని గట్టిగా కేకపెట్టి అతను రాగానే ఈవిడకి మన బాత్‌రూం వగైరాలు చూపించు" అంటూ డ్రస్ మార్చడానికి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రంగన్న చూపించాడు. ముఖం కడిగి

స్నానంచేసి మళ్ళీ అదే చీర కట్టుకుని ఇవతలకి వస్తున్న ఆమెని పెరట్లోకి పోబోతూ పరిశీలనగా చూశాడు యస్.పి.

తన అంచనా మించిన రంగుతో రంభలా కనిపించింది. అప్పుడే అహల్య కూడా అతనికేసి చూసింది. ఒడ్డూ పొడుగూతో ఠీవిగా నిండుగా ఉన్నాడు. చామన ఛాయరంగైనా ఎంతో కళగా వుందాతని ముఖం. క్షణం ఆమె గుండె ఝల్లు మంది. వెంటనే లోపలికి వెళ్ళిపోయింది, తల వంచుకుని.

ఈలోగా పూజ ముగించిన లక్ష్మీపతి అసహనంగా తిరుగుతున్నాడటూ ఇటూ.

ఎన్నడూ లేంది కొడుకు ఓ ఆడపిల్లని ఇంటికి తీసుకురావడం ఆ తండ్రి మనస్సుకు ఆందోళనగానే వుంది.

"ఎవరురా ఆ అమ్మాయి?" అని అడగనే అడిగాడు.

వెంటనే దాచకుండా చెప్పేశాడు. అంతా విన్నాక కాస్త శాంతించింది ఆయన మనస్సు.

తమతోపాటే కాఫీకి పిలిచాడు సుధాకర్.

బెరుకుగానే వచ్చిందామె. "నువ్వెన్నాళ్ళనించి అక్కడ వుంటున్నావు?" అని అడగాడు సుధాకర్ కాఫీ త్రాగుతూ.

"నాకు వూహ తెలిసినప్పట్నించీ ఆ కూపంలోనే వున్నాను."

"నీకు ఎవరూ లేరా?"


"లేరు. వుంటే ఈ హైన్యంనించి ఏనాడో తప్పించుకుపోయేదాన్ని" రుద్ధ కంఠంతో జవాబిచ్చింది.

"నీకక్కడ వుండటం ఇష్టంలేదా?" సూటిగా అడిగాడు సుధాకర్.

"ఇష్టమా? మానాభిమానాలున్న ఏ ఆడపిల్ల అయినా గౌరవంగానే బతకాలనుకుంటుంది కాని, పదిమంది చేతిలో నాశనమవ్వాలని కోరుకోదు.

"నువ్వేమన్నా చదువుకున్నావా?"

"ఆ! టెంత్ క్లాస్ ప్యాసయ్యాను.




ఆ సమాధానానికి తెల్లబోయారు తండ్రీ కొడుకులు.

"మరి చదువుకుంటున్న పిల్లవి నీకీ దౌర్భాగ్యం ఏమిటి?"


"దౌర్భాగ్యమే మరి. నా కన్న తల్లిదండ్రులెవరో నాకు తెలియదు, కాని కాలువలో కొట్టుకువచ్చానట మూడేళ్ళ వయసులో. ఈ వ్యభిచారం నడిపే, పంకజమ్మకే దొరకడం నా దురదృష్టం. ముద్దబంతిపువ్వులా ముద్దుగా వున్న నన్ను ఎప్పటికైనా పనికిరాకపోను అనే ధోరణితోనో, నా మెడన ఓ కాసు బంగారం గొలుసుకే ఆశపడో మొత్తానికి నన్ను పెంచింది. నాలాగా ఆవిడ ఔదార్యంకొద్దీ పెంచినవాళ్ళు మరో అరడజనుమంది వున్నారు. నా గోల భరించలేక నన్ను బడికి పంపింది. విధివశాత్తూ నేను రజస్వల అయ్యేలోగా టెంత్ పూర్తిచేశాను. పెద్దమనిషి అయ్యాక చదువు మాన్పించింది. ఎవడో ఒకడు నన్ను అడుగుతూనే వున్నాడు. బాగా ఎదగలేదని నన్ను పద్దెనిమిదేళ్ళు వచ్చేవరకూ దింపలేదు. ఆ తర్వాత రోజూ యుద్ధమే! తప్పించుకోగలిగినవి తప్పించుకున్నాను. లేనివి అనుభవించాను. అనుక్షణం నరకం అనుభవిస్తూ ఆ యింట్లోంచి విముక్తికోసం పోరాడి అలసిపోతూనే వున్నాను." అంటూ ఆపింది అహల్య.

సానుభూతిగా చూశాడు సుధాకర్!

"నీ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేదాకా ఇక్కడే వుండు." అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు సుధాకర్!

లక్ష్మీపతికూడా అందుకు అంగీకరించాడు.

సుధాకర్ ఓ అరడజను చీరలు కొన్నాడు. ఆమెకి కావలసినవన్నీ అమర్చాడు. మొదట్లో రంగన్నే కాఫీ ఇచ్చేవాడు. రాను రాను సుధాకర్ పనులన్నీ తనే చేయసాగింది అహల్య. అతనున్నంతసేపూ అతని కూడా, కూడా తిరుగుతుంది. అతను వెళ్ళాక లక్ష్మీపతికి ఏమన్నా కావలసివుంటే అమర్చుతుంది. ఆప్యాయంగా కబుర్లు చెబుతుంది. క్రమక్రమంగా లక్ష్మీపతికూడా ఆమెని మనసులో అభిమానించసాగాడు. ఇదివరకు రంగన్నా! అని పిలిచేవాడల్లా ఇప్పుడు ప్రతి పనికి అహల్యా అని పిలుస్తున్నాడు. ఎన్ని గదులు తిరిగినా— దేవుని గదిదగ్గరకు వచ్చేసరికి ఆమె




కాళ్ళు గజగజా వణికిపోతున్నాయి. పవిత్రమైన ఆ దైవశక్తిముందు పాపాత్మురాలైన తను నిలబడటం అపరాధంగా భావించి తల్లడిల్లిపోతోంది పవిత్రత మూసబోసుకున్న ఈ వాతావరణంలో—ఈ మనుష్యులమధ్య తనే ముఖంపెట్టుకుని తిరుగుతోంది? అని తనలో తనే బాధపడేది అహల్య.

సుధాకర్‌కి రాను రాను అహల్య ప్రాణంకింద మారింది. ఆమెని చూడకుండా వుండలేననుకునే స్థితికి వచ్చాడు. ఎలాగైనా ఈమెని పెళ్ళాడాలి అనుకుంటూ తీయని వూహలలో తేలిపో సాగాడు. అహల్యకి సుధాకర్ సాక్షాత్తు భగవత్స్వరూపుడే. అతన్ని చూస్తుంటే ఆమె పరవశించిపోతూవుంటుంది. ఆమె అణువణువులో అతనిపై అపార ప్రేమ వాహిని పొంగి పొరలిపోతుంటే ఆమె కళ్ళకి ప్రపంచంలో ఏదీ కనిపించడం లేదు.

ఈ ముసుగులో గుద్దులాట దేని కన్నట్లు చివరికి తండ్రితో చెప్పాడు సుధాకర్. లక్ష్మీపతి అప్పటికప్పుడు అంగీకారం తెలపడానికి-పరువు ప్రతిష్ఠ కులం గోత్రం అన్నీ కళ్ళముందు గిరగిరా తిరిగాయి. ఎంతైనా వ్యభిచార గృహంలో పట్టుబడిన అమ్మాయిని కోడలిగా స్వీకరించగల ధైర్యం తనకి వుందా? అన్న తర్కంలో పడినా పైకి మటుకు "నీ యిష్టం" అని తనగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ గదిలో గోడకి రెపరెపలాడుతోంది గాంధీజీ క్యాలెండరు. క్రింద ఎవరో చనిపోయినవారి వూరేగింపు రామనామంతో పోతోంది. "రఘుపతి రాఘవ రాజారాం! పతీత పావన సీతారామ్," అంటూ. ఈ పాట గాంధీజీ కత్యంత ప్రీతిపాత్రమైంది. పతితుల నుద్ధరించే శ్రీరాముని దివ్యనామం అతన్ని పులకితుడిని చేసింది. ఎందరో మహానుభావులు-దీనజన సంరక్షణకోసం కృషి చేశారు. చేయమని సలహా యిచ్చారు. అలాంటి ఉత్తమమైన పని తన కన్నబిడ్డ చేస్తానంటే తనెందుకు నిండు మనసుతో ఆశీర్వదించలేక పోతున్నాడు? ఇంకా తనలో పాత వాసనలున్నాయా? తనెన్ని పూజలు చేసినా, ఎన్ని భగవద్గీతలు చదివినా తన మనస్సు పరిణతి పొందలేదా? ఆ ఒక్క మాటా తప్ప అహల్యలో వంకపెట్టవలసిందేమీ లేదు. ఓ నిస్సహాయురాలిని కాపాడటంకంటే-ఓ అబలకి ఆశ్రయం ఇచ్చి గౌరవస్థానం కల్పించడంకంటే తన మానవజన్మకి సాఫల్యం వేరే ఏంకావాలి?"

ఈవిధంగా ఆలోచించడం ప్రారంభించేసరికి తేలికపడింది లక్ష్మీపతికి. సుధాకర్ తనని పెళ్ళిచేసుకుంటానని చెప్పాక అహల్య ఆనందానికి మితిలేదు. ఆ తీపికలలతో హాయిగా నిద్రించిన ఆమెమీద బలమైన రెండు మోటుచేతులు పడి కెవ్వుమంది. ఇంట్లో ఎవరూలేరు - సుధాకర్ డ్యూటీలో వున్నాడు. లక్ష్మీపతి అలా బయటికి వెళ్లాడు. నాటుసారాయి వాసన గుప్పుమంది. రంగన్న వికృతంగా చూస్తూ ఆమెమీదకు వంగుతున్నాడు. వూపిరాడలేదు అహల్యకి—ఆ కంపు భరించలేకపోతోంది. పశువులా మీదపడి రవిక పర్రున చింపేశాడు.

"ఛీ! వదులు" అంటూ పెనుగులాడింది.

"ఓసి. ఏందే! బోగందానికూడా బెట్టేనా! పెద్ద పతివ్రతలాగ కబుర్లాడుతున్నా" అంటూ గట్టిగా బుగ్గకొరికేసరికి చెంప భగ్గుమంది. అంతకంటే పదిరెట్లు మనస్సు భగ్గుమంది.

"ఛీ! పోతావా పోవా! మీ అయ్యగారితో చెబితే నీ బతుకెక్కడ వుంటుందో ఆలోచించు." అంటూ గట్టిగా చెయ్యికొరికింది.

"అమ్మా! నీయి పళ్ళుగాదే!" అంటూ చెయ్యి లాక్కున్నాడు రంగన్న. ఆ పీలు చాలు అహల్యకి. భద్రకాళిలా లేచింది. అక్కడేవున్న పేపర్‌వెయిట్ అందుకుని బలంగా అతని మీదకు విసిరింది. అది సరిగ్గాపోయి రంగన్న నుదుటికి తగిలింది. దాంతో మరీ రెచ్చిపోయి ఎలాగైనా లొంగదీయాలనుకున్నాడు.చీరలాగి అవతల పడేశాడు


గళాలున డ్రాయరులాగింది. అందులో సుధాకర్ రివాల్వర్ వుంది.

"నువ్వు అడుగు ముందుకువేశావంటే నీ గుండెల్లోంచి దూసుకుపోతుం దీ గుండు." అంటూ మహిషాసురమర్దనిలా అరచిన ఆమెనుచూసి కాస్త జంకినా "ఓస్! అందులో గుళ్ళుండాయేటి ?" అన్న ఆలోచనతో నిర్లక్ష్యంగా ఆమె చెయ్యిపట్టుకుని ఆ రివాల్వర్ క్రింద పడేసి ఆమెని మంచంమీదకు నెట్టాడు. కాలితో ఒడుపుగా అందుకున్న అహల్య నిజంగానే రివాల్వర్ పేల్చింది. గుండు గుండెల్లోంచి దూసుకుపోయి ఎఱ్ఱని రక్తం బయటికి వచ్చిలది. రెండు నిముషాలకిగాని ఆమె బుర్ర పనిచేయ లేదు. ఇంతలో వచ్చాడు సుధాకర్. కేవలం లంగాతో దీనంగా ఉన్న ఆమెనిచూని హడలిపోయాడు. జరిగింది తెలుసుకుని కొయ్యబారిపోయాడు. మెల్లగా చీర అందించాడు. లక్ష్మీపతి వచ్చి చూసి నిర్ఘాంతపోయాడు.

ఆవేదనని అణచుకుంటూ, కళ్ళల్లో తిరిగిన నీటిని అద్దుకోవడం మరచి అహల్యని అరెస్టుచేయక తప్పలేదు సుధాకర్‌కి.

ఏ జైలు వద్దని ఆమె ఆనాడు కాళ్ళమీద పడిందో — చివరకీనాడు అదే జైలు సంప్రాప్తించింది. అదీ తన చేతులమీదుగా! ఆదివించీ — ధర్మానికి అధర్మానికి సంఘర్షణ తప్పనట్టే ఆమె విషయంలోకూడా జరిగింది. కాబోయే కోడలు కటకటాల వెనక్కి వెడుతుంటే కళ్ళవెంబడి నీళ్ళుపెట్టుకున్నాడులక్ష్మీపతి ఆ జైలుకు వెళ్ళవలసి రావడం దేనికి ? తన శీలంకోసం–తన పవిత్రత నిలబెట్టుకోవడం కోసమేగా హత్యచేసింది ?

"ఒరేయ్! ఎంత డబ్బయినాసరే! లాయర్ని పెట్టి కేసు అహల్యకే అనుకూలంగా వుండేటట్టుచూడు." అన్న తండ్రి అమాయకత్వానికి బాధపడ్డాడు సుధాకర్!




"అహల్యా! ఈ గొడవమూలాన మనం విడిపోతామని అనుకోకు. నీకు ఎన్ని సంవత్సరాలు శిక్షపడినా నేను నీకోసం వేచివుంటాను." అన్నాడు సుధాకర్ ఆమెనొకసారి దగ్గరకి తీసుకుని.

"నాకు ఏ ఏడుసంవత్సరాలో జైలు వేస్తే మీరు అందాకా నాకోసం కవిపెట్టుకుని వుంటారా ? ప్రమోషన్లతో మీరు పెద్దరాంక్‌లోకి వెళ్ళిపోతారు. అప్పుడీ అల్పురాలి ప్రేమ మీకు గుర్తుంటుందా?" అంది పేలవంగా నవ్వుతూ.

"నా మనస్సు ఇంతేనా నీకు తెలిసింది. ఎన్ని సంవత్సరాలైనా నీకోసం ఆగగలను" అంటూ తన చేతివుంగరం ఆమె వేలికి తొడిగాడు సుధాకర్.

తండ్రి కోరికప్రకారం మంచి లాయరునే కుదిర్చాడు. చంపింది కేవలం ఆమె శీలరక్షణకే గనుక దయార్ద్ర హృదయంతో పరిశీలించవలసిందని అర్జీ పెట్టుకున్నాడు యస్.పి.

ఆ రోజే తీర్పు. కారణం బలమైంది కనుక రెండుసంవత్సరాలు శిక్షవిధించాడు జడ్జీ. రాజమండ్రి సెంట్రల్‌జైలుకు తరలించారు ఆమెని.

ఆ రెండేళ్ళూ శిక్ష అనుభవించడానికి ఏమీ బాధపడలేదు. సుధాకర్ వేలికి తొడిగిన వుంగరం, మామగారు చెప్పిన ధైర్యం–ఆమెకి కొండంత ఉత్సాహన్నిచ్చాయి. ఆమెకీ తెలుసు తనకోసం రఘురాముడిలా సుధాకర్ వేచి వుంటాడని–అలాగే వున్నాడుకూడా.

కాలచక్రంలో రెండేళ్ళూ గిరగిరా తిరిగిపోయాయి. రాజమండ్రిజైల్లో వున్నా ఆమెకి వీలైనప్పుడల్లా కనిపిస్తూనే వున్నాడు సుధాకర్.

చివరకు ఆ శుభముహూర్తం రానే వచ్చింది. సుధాకర్ స్వయంగా వెళ్ళి తీసుకువచ్చాడు. రామపాదం సోకి శాప విమోచనం పొందిన అహల్యలాగే సుధాకర్ చేతిలో చెయ్యివేసి మహోత్సాహంగా ముందుకు సాగిపోయింది అహల్య.

———